www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 9 జులై 2023

5

పశ్చిమ గోదావరి

నేడు ఏలూరులో పవన్‌కళ్యాణ్ సభ

నగర వీధుల్లో ర్యాలీ- పాత బస్టాండ్ సెంటర్లో బహిరంగ సభ

ఏలూరు ప్రతినిధి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం ఏలూరు నగరంలో పర్యటించనున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ఏలూరు మినీ బైపాస్ రోడ్డులోని క్రాంతి కల్యాణ మండపానికి ఆయన చేరుకుంటారు. మధ్యాహ్నం అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి సత్రంపాడు, కొత్తబస్టాండ్, శ్రీనివాస్ థియేటర్‌రోడ్డు, పవర్‌పేట రైల్వేస్టేషన్, ఎఎస్ఆర్ స్టేడియం రోడ్డు మీదుగా పాతబస్టాండ్ సెంటర్‌కు చేరుకుంటారు. సాయంత్రం ఐదు గంటలకు జరగనున్న బహిరంగ సభలో పవన్ మాట్లాడనున్నారు. పవన్ పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లనూ జనసేన నాయకులు పూర్తిచేశారు. సోమ, మంగళవారాల్లో కూడా క్రాంతి కల్యాణ మండపంలోనే పవన్‌కల్యాణ్ బస చేయనున్నారు. ఏలూరు, దెందులూరు నియోజకవర్గాలకు సంబంధించిన నాయకులతో సమావేశం కానున్నారు. అనంతరం 12న తాడేపల్లిగూడెంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు.

ప్రజలు వద్దు.. పైసలే ముద్దు..!

జనం చచ్చినా.. బతికినా తమకు సంబంధం లేదని, చేపల చెరువుల తవ్వకాలే తమకు ముఖ్యమంటూ కైకలూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కొంతమంది అక్రమార్కులు చేపల చెరువుల తవ్వకాలు సాగిస్తున్నా అడిగే నాథుడే లేకుండాపోయాడు. ప్రజాప్రతినిధులు, అధికారుల కనుసన్నల్లోనే ఈ తవ్వకాలు సాగుతున్నట్లు బహిరంగంగానే మాట్లాడుకుంటున్న పరిస్థితి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న చేపల చెరువుల తవ్వకాలపై జనం రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది.



ముదినేపల్లి మండలంలో సాగుతున్న చేపలచెరువు తవ్వకాలు

తాగునీటి చెరువులు, నివాస ప్రాంతాలు దెబ్బతినేలా చేపల చెరువుల తవ్వకాలు

కైకలూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దారుణ పరిస్థితులు

ప్రజాప్రతినిధులు, అధికారుల అండతో రెచ్చిపోతున్న అక్రమార్కులు

ఇప్పటికే సాగు భూములన్నీ చేపల చెరువులుగా మార్పు

పనుల్లేక జనం నానావస్థలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మండవల్లి మండలం కానుకొల్లు గ్రామంలో దళితపేటకు చేర్చి ప్రభుత్వ స్థలాలు, మాజీ సైనికులకు చెందిన భూముల్లో అధికార పార్టీ నాయకులు చేపల చెరువు తవ్వకం చేపట్టారు. ఇక్కడ మురుగుబోదెను మూసివేయడంతోపాటు కాలిబాటను సైతం ఆక్రమించి మట్టిని తవ్వేసి చెరువు గట్టుగా మార్చేస్తున్న పరిస్థితి ఉంది. ఈ చెరువు తవ్వితే దాదాపు అక్కడ నివాసముంటున్న 200కుపైగా దళిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడనుంది. చెరువు తవ్వకంతో తాగునీటికి ఉపయోగించే బావి పూర్తిగా దెబ్బతింటుందని, వరదల సమయంలో ఊరు మునిగిపోయే ప్రమాదం ఉందని, తమ మనుగడకు, జీవనానికి ప్రమాదం ఏర్పడుతుందని అక్కడి దళితులంతా గగ్గోలు పెడుతున్నారు. ఈ చెరువు తవ్వకాలు నిలుపుదల చేయాలని దళితులంతా రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోని దుస్థితి నెలకొంది. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ఈ చెరువు తవ్వకం జరుగుతుండటంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో అక్కడి ప్రజలంతా కోర్టును ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది.

కలిదిండి, ముదినేపల్లి మండలాల్లోనూ అదే పరిస్థితి

కలిదిండి మండలం సీతారామపురం అగ్రహారంలో ఆరు గ్రామాలకు చెందిన మూడు వేల మందికి తాగునీరు అందించే ఏడెకరాల చెరువు పక్కనే 20 ఎకరాల్లో చేపల చెరువులు తవ్వుతున్నారు. దీంతో తాగునీరు పూర్తిగా కలుషితం కానుండటంతో జనం గగ్గోలు పెడుతున్నారు. జనం గోడు ఏమాత్రం పట్టించుకోకుండా నాయకులంతా ఏకమై ముందుకు సాగుతున్న పరిస్థితి నెలకొంది. ఇదే మండలం కొండంగి గ్రామంలో ఎత్తిపోతల పథకానికి చెందిన మూడెకరాల భూమిని కబ్జా చేసి పెద్దలంక రోడ్డు దెబ్బతినేలా ఆక్వా చెరువులు తవ్వుతున్నారు. సానా రుద్రవరంలో దళితపేటకు ఆనుకుని ఏడెకరాల్లో చెరువుల తవ్వకాలు సాగిస్తున్నారు. ముదినేపల్లి మండలం దేవపూడి, ఊటుకూరు గ్రామాల్లో పంటచేలకు ఆనుకుని అక్రమంగా చేపల చెరువుల తవ్వకాలు సాగుతున్నాయి. పురిటిపాడు, చినగొంద గ్రామాల్లో దళితుల నివాసాలకు పక్కనే చేపల చెరువులు తవ్వుతున్న పరిస్థితి ఉంది. ఇవే కాకుండా కైకలూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇదే విధంగా అక్రమంగా చేపల చెరువుల తవ్వకాలు సాగిపోతున్నాయి. కొల్లేరు భూముల్లో సైతం పెద్ద ఎత్తున చేపల చెరువుల తవ్వకాలు సాగిస్తున్న పరిస్థితి ఉంది. అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితం కావడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. స్థానిక ఎంఎల్ఎ కనుసన్నల్లోనే ఈ తవ్వకాలు సాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ఆక్సిజన్ ప్లాంట్

కైకలూరు మండలం పల్లెవాడ రెవెన్యూ పరిధిలో నర్సాయపాలెంలో ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ఫిషరీస్ ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణం సాగిపోతుంది. కొల్లేరు ఐదో కాంటూరు పరిధిలో తాగునీటి చెరువు, జగనన్న కాలనీకి చేర్చి నిర్మిస్తున్న ఈ ప్లాంట్‌తో తమకు తీవ్ర ఇబ్బందులు తప్పవని స్థానికులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకోవడం లేదు. గ్రామసభలో జనం ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించినా ముందుకు సాగుతున్న పరిస్థితి. ప్రశ్నిస్తున్న జనాన్ని బెదిరిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. ప్రజలు వద్దు.. చేపల చెరువుల పైసలే ముద్దు అనే తరహాలో ప్రభుత్వం, అధికారులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది.

అమర్‌నాథ్ యాత్రకు వెళ్లి..

జమ్మూలో చిక్కుకున్న అజ్జమూరు వాసులు

ప్రజాశక్తి - ఆకివీడు

అమర్‌నాథ్ యాత్రను వాతావరణ పరిస్థితులు అనుకూలించక ఆపేయడంతో ఆకివీడు మండలం అజ్జమూరులో శనివారం కలకలం సృష్టించింది. ఈ నెల 5న ఆకివీడు మండలం అజ్జమూరుకు చెందిన యర్రా రఘు దంపతులు అమర్‌నాథ్ యాత్రకు బయల్దేరారు. వీరు జమ్మూ చేరుకునేటప్పటికీ అక్కడి నుంచి అమర్‌నాథ్ వెళ్లే మార్గంలో కొండచరియలు విరిగిపడటం, వాతావరణం అనుకూలించకపోవడంతో తాము జమ్మూలోనే ఉండిపోయారు. అమర్‌నాథ్ యాత్రలో తెలుగువారు చిక్కుకున్నారనే వార్తలతో అజ్జమూరు వాసులు కలత చెందారు. తాము క్షేమంగానే ఉన్నామనిశనివారం మధ్యాహ్నం రఘు స్థానికులకు ఫోన్ చేసి చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తమకు ఇక్కడ ఎటువంటి ఇబ్బందీ లేదని, ప్రభుత్వం అన్ని సౌకర్యాలూ కల్పించిందని చెప్పారు. వాతావరణం అనుకూలించగానే అమర్‌నాథ్ యాత్ర కొనసాగిస్తామని తెలిపారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వం : కలెక్టర్

నష్టపోయిన రైతులకు రూ.1.62 కోట్ల పంటల బీమా జమ

ప్రజాశక్తి - భీమవరం

రైతులకు నమూనా చెక్కును అందిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

అన్నదాతలకు అండగా రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. వరుసగా నాలుగో ఏడాది 2022 ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన 2,922 రైతన్నలకు వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పరిహారం కింద విడుదల చేసిన రూ.1.62 కోట్ల నమూనా చెక్కును కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ప్రశాంతి రైతులకు అందజేశారు. తొలుత వైఎస్ఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3 సమీకృత వ్యవసాయ ప్రయోగశాల కేంద్రాలను భీమవరం, ఇరగవరం, పాలకొల్లు నియోజకవర్గాల్లో నిర్మించినట్లు తెలిపారు. ఒక్కో కేంద్రానికి రూ.1.50 కోట్ల నిధులను సమకూర్చినట్లు తెలిపారు. వాటిలో వ్యవసాయానికి సంబంధించిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాల పరీక్షలే కాకుండా, పశుసంవర్ధక శాఖకు సంబంధించిన వ్యాధి నిర్ధారించే పరీక్షలు కూడా చేయడం జరుగుతోందన్నారు. వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకం కింద జిల్లాకు ప్రభుత్వం రూ.46.56 కోట్లు ప్రీమియంగా చెల్లించినట్లు తెలిపారు. వైఎస్ఆర్ రైతు భరోసా - పిఎం కిసాన్ కింద 2023-24లో 1.18 లక్షల లబ్ధిదారులకు రూ.88.58 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కె.కృష్ణ వేణి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కెఎఎస్ఎస్.శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ, జిల్లా హార్టికల్చర్ అధికారి ఎ.దుర్గేష్, జిల్లా మత్స్య శాఖ అధికారి ఆర్‌విఎస్‌వి.ప్రసాద్ పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో అంగన్‌వాడీల 36 గంటల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 10, 11 తేదీల్లో భీమవరం కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా నిర్వహించనున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.ఝాన్సీ లక్ష్మీ, డి.కళ్యాణి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీలకు సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ అంగన్‌వాడీల కంటే ఎక్కువ వేతనాన్ని ఇవ్వాలని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని పేర్కొన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, ఖర్చులకు అనుగుణంగా దాన్ని పెంచాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.5 లక్షలు జీతంలో సగం పింఛనుగా ఇవ్వాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. 48 సంవత్సరాల నుండి అంగన్‌వాడీలు గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అనేక సేవలందిస్తున్నా ప్రభుత్వాలు వారికి ఉద్యోగ భద్రత కల్పించలేకపోయాయని విమర్శించారు. కొత్త పథకాలు, కొత్త యాప్‌లు తీసుకొచ్చి అంగన్‌వాడీలపై పని భారాన్ని విపరీతంగా పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ 36 గంటల నిరవధిక ధర్నాకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేస్తున్న శాంతియుత ధర్నాకు జిల్లా కలెక్టర్, పోలీస్ అధికారులు, ఐసిడిఎస్ అధికారులు సహకరించాలని కోరారు.

వీరవాసరం :తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10, 11వ తేదీల్లో అంగన్‌వాడీలు చేపట్టే 36 గంటల ధర్నాను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ శనివారం ధర్నా ప్రచార గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నప్పటికీ అంగన్‌వాడీల వేతనాలు మాత్రం పెరగడం లేదన్నారు. పని ఒత్తిడి, వేధింపులు పెరుగుతున్నాయన్నారు. ఇప్పటికే పలు దఫాలుగా తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేసినప్పటికీ పాలకుల్లో చలనంలేదన్నారు. అందుకే 36 గంటల ధర్నాకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. క్షేత్రం స్థాయిలో వస్తున్న ఇబ్బందులను చెప్పుకోవడానికి జాయింట్ మీటింగ్ కూడా అధికారులు జరపడం లేదన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ వర్కర్లు నాగరత్నం, వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రయోగశాలలను సక్రమంగా కొనసాగించాలి

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - ఉండి

పశువుల్లో వచ్చే వివిధ రకాల వ్యాధులను నిర్ధారించడానికి పశువ్యాధి నిర్ధారణా ప్రయోగశాలను రైతులందరూ ఉపయోగించుకోవాలని ఎంఎల్ఎ మంతెన రామరాజు కోరారు. ఉండి నియోజకవర్గ స్థాయిలో ఉండి ప్రాంతీయ పశు వైద్యశాలలో నిర్మించిన పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను శనివారం ఎంఎల్ఎ ప్రారంభించి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ తమ హయాంలో పలు రకాల ప్రయోగశాలలను ప్రారంభించడం అభినందనీయమన్నారు. అయితే వాటిని సక్రమంగా కొనసాగించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎంతో పేరుగాంచిన ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలోని మత్స్య పరిశోధన స్థానంలో రూ.ఏడు కోట్లతో ప్రయోగశాలను ప్రారంభించామని, తర్వాత కాలంలో ఆ ప్రయోగశాలను కొనసాగించడంలో అధికారులు, ప్రభుత్వం విఫలమవ్వడంతో కోట్ల రూపాయలు విలువచేసే పరికరాలు నిరుపయోగంగా మారిపోయాయన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు జావర్ హుస్సేన్ మాట్లాడుతూ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలో గతంలో జిల్లా కేంద్రంలోనే ఉండేవని, నేడు ప్రతి నియోజకవర్గంలోనూ ఒక ప్రయోగశాల ఉండాలనే ఉద్దేశంతో ఉండిలో వైఎస్ఆర్ నియోజకవర్గస్థాయి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో సుమారు 10 రకాల నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, జెడ్‌పిటిసి రణస్థల కనకదుర్గ మహంకాళి, గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, నాయకులు కరిమెరక నాగరాజు, జుత్తిగ శ్రీనివాస్, కిన్నెర వెంకన్న పాల్గొన్నారు.

పశు వైద్యాధికారులతో ఎంపిటిసిలు వాగ్వివాదం..

నియోజకవర్గ స్థాయిలో పశువ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని ఉండిలో ప్రారంభించగా అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా ఉండి-1, ఉండి-2 ఎంపిటిసిలను కార్యక్రమానికి ఆహ్వానించలేదని అధికారులతో వాగ్వివాదానికి దిగారు. అక్కడే ఉన్న ఎంఎల్ఎ మంతెన రామరాజు జోక్యం చేసుకుని ఎంపిటిసిలకు సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

ప్రయోగశాలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ రామరాజు

కష్టజీవుల పక్షపాతి జ్యోతిబసు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం : జ్యోతిబసు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

కార్మిక నేత, ప్రజాబంధు, భారతదేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన ప్రజా నాయకుడు, కష్టజీవుల పక్షపాతిగా జీవితాంతం పోరాడిన శ్రామికనేత కిరణ్ జ్యోతిబసు అని సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం జ్యోతి బసు 109వ జయంతి సభ తాడేపల్లిగూడెం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా జ్యోతి బసు చిత్రపటానికి సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడారు. సూర్య సేన్ నాయకత్వాన సాగిన చిట్టిగ్యాంగ్ సాయుధ పోరాటం, జ్యోతిబసుకు విద్యార్థి దశలో స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. ఉన్నత చదువులకు జ్యోతిబసు లండన్ వెళ్లారని, అక్కడ గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ నాయకులతో పరిచయం ఏర్పడిందని, వారి ప్రభావంతో అక్కడ శ్రామిక పోరాటాల్లో పాల్గొన్నారని వారు తెలిపారు. జ్యోతి బసు 24 సంవత్సరాలపాటు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో శ్రమజీవుల కోసం ఆయన అనేక చర్యలు చేపట్టారన్నారు. భూ సంస్కరణలు చేపట్టి పేదలకు భూ పంపిణీ చేయడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగు చేశారని వారు పేర్కొన్నారు. కార్మిక వర్గ రాజ్యస్థాపన కోసం, సామాజిక మార్పు కోసం ఆయన తన జీవిత కాలం కృషి చేసిన బాటలో కొనసాగి ఆ లక్ష్యసాధన కోసం పనిచేస్తామని ప్రతినబూనడమే మనం ఆయనకిచ్చే నిజమైన నివాళని తెలిపారు. కార్యక్రమంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు, జవ్వాది శ్రీను, నరమాల కృష్ణ, గొర్రెల సతీష్ కుమార్, మేట్రెడ్డి రమణ, పులిమంతుల రమణ పాల్గొన్నారు.

ఆచంట : ప్రజాస్వామ్య విలువలకు నిలువుటద్దం జ్యోతిబసు అని సిపిఎం నాయకులు తోటపల్లి సత్యన్నారాయణ అన్నారు. జ్యోతిబసు 109వ జయంతి సందర్భంగా సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ జ్యోతి బసు విద్యార్థి దశ నుండే స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రజలకు తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సిర్రా నర్సింహమూర్తి, వద్దిపర్తి అంజిబాబు, ఎస్‌విఎన్.శర్మ, కుసుమే జయరాజు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ శకం చిరస్మరణీయం

డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కొట్టు

వైఎస్ఆర్ శకం చిరస్మరణీయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. వైఎస్ఆర్ జయంతి సందర్భంగా శనివారం స్థానిక ఓవర్ బ్రిడ్జి సెంటర్లో ఆయన విగ్రహానికి మంత్రి కొట్టు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానుభావులు అరుదుగా జన్మిస్తుంటారని, రాజశేఖర్‌రెడ్డి కారణజన్ముడు అని కొనియాడారు. వైఎస్ఆర్ సహకారంతోనే తాడేపల్లిగూడెం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. తండ్రిని మించిన తనయుడిగా సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రజా రంజక పాలన అందిస్తున్నారన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు గుండుబోగుల నాగు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కె.భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, మాజీ జెడ్‌పిటిసి మండల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కేక్ కట్ చేసి పంచారు.

పిహెచ్‌సిలో అడిషనల్ డిఎంహెచ్ఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజలకు మరిన్ని వైద్య సేవలందించాలని జిల్లా అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ బి.భానునాయక్ వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. కాళ్ల పిహెచ్‌సిని భాను నాయక్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పిహెచ్‌సిలో కంటివెలుగు, ఫ్రైడే డ్రైడే, ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం పనితీరును అడిగి తెలుసుకున్నారు. పెదఅమిరంలో 1, 2 విలేజ్ హెల్త్ క్లినిక్‌లను పరిశీలించారు. క్లినిక్‌కు సంబంధించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇమ్యునైజేషన్‌ను మెరుగుపర్చాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది పనితీరు గురించి ప్రజలకు అందుతున్న సేవల గురించి తెలుసుకొని, సిబ్బందిని మరిన్ని మెరుగైన సేవలందించాలని ఆదేశించారు. అనంతరం కాళ్ల పంచాయతీలో ఫ్రైడే -డ్రైడే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి కె.శ్రీనివాసరావు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కె.భాస్కరరావు, ఆరోగ్య విస్తరణాధికారి హరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కెవికెలో ఘనంగా రైతు దినోత్సవం

ఉండి:వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పుట్టగొడుగులు, తేనెటీగలు, మిద్దెమీద తోటల పెంపకం, విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లికార్జునరావు అన్నారు. శనివారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెవికెలో పుట్టగొడుగులు, తేనెటీగల పెంపకం వంటి రంగాల్లో శిక్షణ పొంది వ్యాపారంలో ఉత్తమ ఫలితాలు పొందుతున్న రైతులు ప్రసాద్‌రాజు, అంగర వెంకటేశ్వరరావు, అంబేద్కర్ వంటి వారిని ప్రశంసించారు. పుట్టగొడుగులు, తేనెటీగల పెంపకం వంటి రంగాల్లో ఎవరైనా శిక్షణ పొంది వ్యాపారవేత్తలుగా ఎదగాలనుకునేవారు ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ దెబోరా మిస్సియానా, డాక్టర్ ఎ.శ్రీనివాస్, డాక్టర్ ఎ.రాజేష్, డాక్టర్ పి.వినయలక్ష్మి, బి.రజిత, కోరమాండల్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జనసేనానికి గోదావరి కలిసొచ్చేనా..!

'గోదావరి జిల్లాల్లో వైసిపికి ఒక్క సీటూ దక్కనీయకుండా చేస్తాం.. ఇక్కడ నుంచే అధికార పార్టీని గద్దె దింపుతాం'.. ఇవీ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పర్యటనలో చేసిన ప్రకటనలు. తూర్పుగోదావరి జిల్లా అన్నవరం నుంచి ప్రారంభించిన వారాహి మొదటి దశ యాత్ర భీమవరంలో ముగియగా, మళ్లీ ఏలూరు నుంచి రెండో దశ యాత్ర ప్రారంభం కానుంది. రెండో దశ యాత్ర రూట్‌ను పరిశీలించినా మొత్తంగా ఉభయ గోదావరి జిల్లాలపై జనసేనాని దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. అయితే గోదావరి జిల్లాలు జనసేనానికి కలిసొచ్చేనా.. అదే జరిగితే రాష్ట్రంలో అధికార మార్పిడి ఖాయమేనా అనే చర్చ సర్వత్రా సాగుతోంది.

గత ఎన్నికల్లో జనసేన వామపక్షాలతో సీట్ల సర్దుబాటు చేసుకుని జిల్లాలో బరిలోకి దిగింది. పవన్‌కళ్యాణ్ భీమవరం అసెంబ్లీ నియోజకవర్గ స్థానం నుంచి బరిలోకి దిగగా నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఆయన సోదరుడు నాగేంద్రబాబు బరిలోకి దిగారు. వామపక్షాలు, కార్మిక సంఘాలు బలంగా ఉన్న ప్రాంతాలు కావడంతో జనసేనకు గణనీయమైన ఓట్లే లభించాయి. ఉండి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థి బరిలోకి దిగారు. నరసాపురం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, భీమవరం స్థానాల్లో జనసేనకు చెప్పుకోదగ్గ ఓట్లే లభించాయి. అయితే భీమవరంలో పవన్ కళ్యాణ్ ఓటమితో ఆ పార్టీ శ్రేణులు తీవ్ర నిరాశ, నిరుత్సాహానికి గురయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల దగ్గర నుంచి కొంత ప్రభావం చూపడం, ఆపై వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఆ పార్టీ శ్రేణులు జనానికి దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేశాయి. అయితే గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లన్నీ తమ బలంతోనే వచ్చాయనుకోవడం ఆ పార్టీ నేతల బలహీనతగా కన్పిస్తోందనేది రాజకీయ పరిశీలకుల వాదన. గతంతో పోలిస్తే ఆ పార్టీ గ్రామస్థాయిలో ఇప్పటికీ కమిటీల నిర్మాణం పెద్దగా జరగలేదు. జనసేనకు యువత అండగా ఉండటం ప్రధాన బలంగా కన్పిస్తోంది. అదే సమయంలో వారంతా ఎక్కువగా కాపు సామాజిక తరగతికి చెందిన వారే కావడం బలహీనతగా ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. నియోజకవర్గ స్థాయిలో నేతలు కన్పిస్తున్నా మండల, గ్రామస్థాయిలో బలోపేతం కాకపోతే వచ్చే ఎన్నికల్లో ఏదోక పార్టీతో పొత్తు లేకుండా గెలుపు అసాధ్యమని ఆ పార్టీ నేతలే కుండబద్దలు కొట్టినట్లు చెబుతున్నారు. అయితే రాష్ట్రంలో అధికార మార్పిడి కోసం గోదావరి జిల్లాలపై పవన్ దృష్టి సారించడం మంచి ఎత్తుగడ అయినప్పటికీ ప్రజలను ఆకర్షించేలా సమస్యలు, పరిష్కారం విధానంపై మాట్లాడకుండా అధికార పార్టీ వైసిపి నేతలను టార్గెట్ చేసి మాట్లాడటం వల్ల పెద్దగా ఉపయోగం ఉందని ఆ పార్టీ శ్రేణులే పెదవివిరుస్తున్నాయి. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో నీటి కాలుష్యం, ఏజెన్సీలో పోలవరం నిర్వాసితుల సమస్య, ఉపాధి లేమి, రోడ్లు అధ్వానంగా ఉండటం వంటి సమస్యలతోపాటు పెట్రోలు, డీజిల్ ధరలను తలదన్నేలా నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరగడం వంటి భారాలతో జిల్లావాసులు సతమతమవుతున్నారు. దీనికి కారణమైన కేంద్రంలోని బిజెపిని నిలదీయకుండా మౌనం వహిస్తూ వైసిపి నేతలపై సినిమా డైలాగులు పేల్చడం తాత్కాలిక కేరింతలకు మాత్రమే ఉపయోగపడుతుందనేది పరిశీలకుల వాదన. జనం మెప్పు పొందాలంటే ప్రజా సమస్యలకు, భారాలకు కారకులను నిలదీయకుండా, ప్రత్యామ్నాయాలు చూపకుండా, తాము అధికారంలోకొస్తే ఏం చేస్తామో చెప్పకుండా వారిని అధికారానికి దూరం చేస్తాం.. ఎక్కడ గెలవనీయం వంటి ప్రకటనల వల్ల ఉపయోగం లేదనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. కచ్చితంగా రాష్ట్రంలోని అధికార పార్టీ వైసిపి అవినీతి, అక్రమాలతోపాటు ప్రజలపై భారాలకు కారణమైన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని నిలదీసి, తమ ప్రత్యామ్నాయ విధానాలు ఏమిటో జనానికి చెబితే జనసేనాని ఆశించినట్లు గోదావరి జిల్లాల్లో గెలుపుబాట పట్టే అవకాశం ఉందని, లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో గత ఎన్నికల ఫలితాలతో పోలిస్తే గణనీయమైన మెరుగుదల సాధించడం కష్టమని అభిప్రాయపడుతున్నారు. రెండో దశ వారాహి యాత్రలోనైనా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆ దిశగా అడుగులు వేస్తారో.. లేదో వేచిచూడాలి.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

ఆలయ కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రమాణం

ఛైర్మన్‌గా మళ్లీ కోరాడ శ్రీనివాస్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్‌గా కోరాడ శ్రీనివాస్ 2వ సారి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ట్రస్టీలుగా పొత్తూరి పద్మ, తాటిపూడి రామలింగేశ్వర శర్మ, చింతా కాత్యాయినీ, నీలంశెట్టి సత్యప్రసాద్, ముంగడి అన్నవరం, యాళ్ల వరలక్ష్మి, టి.వరలక్ష్మి, కాండ్రేకుల రాజేశ్వరి, సన్నిధిరాజు రామకృష్ణ మూర్తి బాధ్యతలు చేపట్టారు. ఇఒ యాళ్ల సూర్య నారాయణ వారితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గమ్మ ఆలయ ఛైర్మన్ కావలి శ్రీనివాస్, బిజెపి పట్టణ అధ్యక్షులు జక్కంపూడి కుమార్ పాల్గొన్నారు.

ఇంగ్లీషులో ప్రావీణ్యతతో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యార్థులు ఇంగ్లీష్‌లో ప్రావీణ్యత సంపాదిస్తే మంచి ఉద్యోగాలు వస్తాయని హైదరాబాద్, మేధా అకాడమీ డైరెక్టర్ చిరంజీవి చెప్పారు. పాలకొల్లు మాంటిస్సోరి కళాశాల ఫ్రెషర్స్ డే సందర్భంగా ఆయన కెరీర్ గైడెన్స్‌పై మాట్లాడారు. విద్యార్థి ఉపయోగించే స్కిల్‌పై ఆదాయం వస్తుందని చెప్పారు. ఏ వృత్తిలోనైనా ఇష్టపడి కష్టపడాలని కోరారు. కళాశాల సెక్రటరీ కెవి.కృష్ణవర్మ పట్టణంలో మెరిట్ విద్యార్థులకు రూ.12 లక్షల నగదు బహుమతులు అందజేశారు. ఈ ఏడాది ఇంటర్‌లో 470కు 400 మార్కులు తెచ్చుకుంటే రూ.20 వేల చొప్పున స్కాలర్‌షిప్ ఇస్తానని ప్రకటించారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో 'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పాలకొల్లు

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో పాలకొల్లు ఆదిత్య డిగ్రీ విద్యార్థులు విజయభేరి మోగించారు. శుక్రవారం ప్రకటించిన ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ డిగ్రీ ప్రథమ సెమిస్టర్ ఫలితాల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారు. 50 మందికి పైగా విద్యార్థులు 9.0 గ్రేడ్ పాయింట్ల కంటే ఎక్కువ సాధించారని ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్‌వి.రాఘవరెడ్డి తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ కె.గంగాధర్ మాట్లాడుతూ యూనివర్సిటీ పరీక్షలు, పోటీ పరీక్షలు, ఉద్యోగ నియమాకాల్లో ఆదిత్య విద్యార్థులు ముందంజలో ఉంటారని తెలిపారు.

ఛాంబర్స్ కళాశాల విజయభేరి

పాలకొల్లు :ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు అన్ని గ్రూపుల్లో అత్యుత్తమ గ్రేడ్స్ సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. 47 మంది విద్యార్థులు 9.0 గ్రేడ్ పాయింట్స్ పైన సాధించినట్లు తెలిపారు. బిఎస్‌సి 87 శాతం, బీకాం 88 శాతం, బిబిఎ 85 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహరావు, కార్యదర్శి కలిదిండి రామరాజు, ఎకడమిక్ అడ్వైజర్ నందుల సీతారామారావు విద్యార్థులను అభినందించారు.

రామలింగయ్య సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - ఆచంట

ఆత్మీయ సేవా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు వెలిచేటి రామలింగయ్య సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. కోడేరు ఆత్మీయ సేవా కేంద్రంలో శనివారం రామలింగయ్య వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత రామలింగయ్య విగ్రహాన్ని ఐడియు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ నరేంద్ర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు రామలింగయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బెంగళూరుకు చెందిన సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి చేకూరి వెంకట్ మాట్లాడుతూ ఆత్మీయ సేవా కేంద్రం ద్వారా ఈ ఏడాది ఆచంట మండలంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల నైపుణ్యం పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో డిగ్రీ చదివిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా వివిధ సంస్థలతో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమ ంలో డాక్టర్ కపిల్, వెలిచేటి మోహన్‌రావు, కమ్యూనిస్టు సమితి కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ సుబ్బారావు, డివిఎస్.వర్మ మనోరమ, కేతా గోపాలం, నెక్కంటి కృష్ణ, వైట్ల కిషోర్, నెక్కంటి ప్రభాకర్, చింతపల్లి గురుప్రసాద్, చేకూరి ప్రసాద్‌మోహన్‌రావు, వెలిచేటి భరద్వాజ, పెచ్చెట్టి సత్యనారాయణ, నెక్కంటి సతీష్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రతి మహిళా ఆర్థికంగా బలోపేతం అవ్వాలని సిఎం జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక త్యాగరాజు భవనంలో మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు తయారుచేసిన వస్తువుల విక్రయాలకు సంబంధించి అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ మార్కెట్‌ను ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి డ్వాక్రా సంఘాలను బలోపేతం చేశారని, పావలా వడ్డీకే రుణాలు ఇచ్చారని, మిగిలిన వడ్డీని ప్రభుత్వం చెల్లించిందని చెప్పారు. మహిళలు ఆర్థికంగా బలోపేతమైతే ఆ కుటుంబాలు అన్ని విధాలుగా ఉన్నత స్థితికి చేరుకుంటాయని ఆనాడు రాజశేఖరరెడ్డి భావించారన్నారు. ముందుగా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించి వారిని అభినందించారు.

గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - గణపవరం

గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. గణపవరం ప్రాథమిక ఆసుపత్రి ఆధ్వర్యంలో జాతీయ డెంగీ నివారణ మసోత్సవం సందర్భంగా శనివారం అర్ధవరంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ప్రతిఒక్కరూ పారిశధ్య మెరుగుదలకు కృషి చేయాలన్నారు. డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ డెంగీ నివారణ మసోత్సవాలు నెలరోజుల పాటు గ్రామాల్లో నిర్వహించి ప్రజలకు దోమల నివారణపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు దండు వెంకటరామరాజు, సిహెచ్ఒ జాలాది విల్సన్‌బాబు, హెల్త్ అసిస్టెంట్లు జి.శ్రీనివాస్, ఎ.కృష్ణ, ఎం.యోహన్, ఎం.నల్లయ్య, పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మొగల్తూరు

పేరుపాలెం సౌత్ పంచాయతీ పరిధి మొళ్లపర్రు గ్రామంలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో తిరుమాని వెంకటేశ్వరరావు, బందన నాగరాజులు మృతి చెందడం చాలా బాధాకరమని కొవ్వలి ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వరరావు, నాగరాజు కుటుంబ సభ్యులకు రూ.పది వేల చొప్పున రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకే కొవ్వలి యతిరాజు రామ్మోహన్‌నాయుడు ఫౌండేషన్ స్థాపించి సేవలు అందిస్తున్నారన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం కూడా అన్ని రకాలుగా ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్తినేని సర్వేశ్వరరావు, వాతాడి ఉమా మహేశ్వరరావు, సత్తినేని బాబ్జి, సంకు భాస్కరనాయుడు, లక్కు శ్రీను, అంద్రాజు రామన్న, రేవు పద్మారావు, అంద్రాజు వెంకటేశ్వరరావు, నంద్యాల బాబు, భూపతి బాబ్జి, ముస్కుడి రవి, రాజబాబు, భోగిరెడ్డి ముత్యం, నంద్యాల హనుమంతు, పంజా దినేష్ పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలకు సాగు, తాగు నీరందించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

శివారు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలని మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు డిమాండ్ చేశారు. ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకుని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న మొగల్తూరు మండల శాఖ మాజీ అధ్యక్షులు జక్కంశెట్టి వెంకటేశ్వరరావును ఆయన శనివారం పరామర్శించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. మురుగు కాలువలు, సాగునీటి కాలువలు ప్రక్షాళన చేయట్లేదని చెప్పారు. దీంతో గోదావరి జిల్లాలోని రైతులు సాగు విరామం పాటించే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఆయనతో పాటు మాజీ వైస్ ఎంపిపి అంద్రరాజు రామన్న, బస్వని ఏడుకొండలు, కవురు రంగా, చంపాటి సత్యనారాయణరాజు, ఇనుకొండ కాశీ, జోగి మురళి ఉన్నారు.

12న తాడేపల్లిగూడెంలో జనసేన బహిరంగ సభ

తాడేపల్లిగూడెం :జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ వారాహి రెండోదశ యాత్రలో భాగంగా తాడేపల్లిగూడెంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఉభయ జిల్లాల ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం స్థానికంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాత్రలో భాగంగా పవన్‌కల్యాణ్ 11వ తేదీ సాయంత్రానికి తాడేపల్లిగూడెం చేరుకుని మూడు రోజుల పాటు తాడేపల్లిగూడెంలో ఉంటారన్నారు. రాష్ట్ర, స్థానిక సమస్యలపై చర్చిస్తారన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని నలుమూలాల నుంచి జనసైనికులు, జనసేన వీర మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని 12వ తేదీన జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

వివేకానంద స్కూల్లో చోరీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక భీమవరం వన్‌టౌన్ పరిధిలోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం హైస్కూలులో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. లాకర్లు బద్దలు కొట్టి సుమారు రూ.ఐదు లక్షల నగదు అపహరించినట్లు స్కూల్ యాజమానం తెలిపింది. శనివారం ఉదయం స్కూల్ యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పేదల పెన్నిధి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి

జయంతి వేడుకల్లో వైసిపి నేతలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ప్రభుత్వ చీఫ్ విప్ క్యాంపు కార్యాలయంలో, పట్టణ పరిధిలో స్టీమర్ రోడ్డులో ఉన్న విగ్రహాలకు ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాప్రతినిధులు మెరుగైన సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబిసి ఛైర్మన్ వీరన్న, రాష్ట్ర కనీస వేతనాలు ఛైర్‌పర్సన్ బర్రె లీలా, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బంధన పూర్ణచంద్రరావు, వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, వైస్ ఛైర్మన్ కొత్తపల్లి భుజంగరాయుడు, వైస్ ఛైర్‌పర్సన్ కామన నాగిని, జెడ్‌పిటిసి సభ్యులు రాధాకృష్ణ, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కాళ్ల : వైఎస్ఆర్ పేదల పెన్నిధి అని డిసిసిబి ఛైర్మన్, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని పెదఅమిరం సీసలి, దొడ్డనపూడి, ప్రాతళ్లమెరక, కలవపూడి, ఏలూరుపాడు, జువ్వలపాలెం, కాళ్ళ, కోపల్లె గ్రామాల్లో వైఎస్ఆర్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. పేదలకు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, పెదఅమిరం గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, ఎంపిపి శిరీష విశ్వనాధరాజు, కోపల్లె సొసైటీ అధ్యక్షులు వేగేశ్న జయ రామకృష్ణంరాజు, వైసిపి నాయకులు వేగేశ్న బాలగణపతి వర్మ సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.



పాలకోడేరులో...

ఆచంట : మండలంలోని వైఎస్ఆర్ విగ్రహాలకు వైసిపి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆచంట, కోడేరు, పెనుమంచిలి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం, పెనుమంచిలి, ఆచంట వేమవరం అయోధ్యలంక గ్రామాల్లో వైఎస్ఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచులు కోట సరోజిని వెంకటేశ్వరరావు, సుంకర సీతారామ్, జక్కంశెట్టి చంటి, దిరిశాల విజయలక్ష్మి, గణేశుల శేషవాణి సుబ్బారావు పాల్గొన్నారు.

ఉండి : మండలంలోని అన్ని గ్రామాల్లోనూ, రైతు భరోసా కేంద్రాల్లోనూ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన ఉండి పోలీసు స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాట తప్పని మడమ తిప్పని నాయకుడు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అని కొనియాడారు. 2004లో పాదయాత్ర చేసేటప్పుడు రైతులకు, రోగులకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను తీసుకువచ్చి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించారన్నారు. అనంతరం పేదలకు వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, కార్పొరేషన్ డైరెక్టర్లు గులిపల్లి అచ్చారావు, కొర్రపాటి అనిత, నాయకులు రణస్తుల మహంకాళి, గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ, కరిమెరక మల్లికార్జున, కమతం బెనర్జీ, కరిమెరక శివ నాగరాజు, అంగర రాంబాబు, శేషాద్రి శ్రీనివాస్, రాయి సతీష్, బడుగు బాలాజీ, వీరమల్లు మల్లేశ్వరరావు, గలావిల్లి ధనుంజయ పాల్గొన్నారు.

గణపవరం : రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా శనివారం స్థానిక ఇందిరమ్మ కాలనీలో ఉన్న రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. వృద్ధులకు దుప్పట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దండు వెంకటరామరాజు, వైసిపి మండల కన్వీనర్ దండురాము, గ్రామ సర్పంచి మూరా అలంకారం భాస్కరరావు, సూర్యబలిజ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, వైసిపి నాయకులు కాకర్ల శ్రీను, రొంగల శ్రీను, డి.బాబులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. సరిపల్లెలో జరిగిన కార్యక్రమంలో ఛాంబర్ అధ్యక్షులు చనుమూరి లక్ష్మీదుర్గాభవాని శివప్రసాద్, వెంకటాపురంలో సర్పంచి మల్లంపల్లి సురేష్, మొయ్యేరులో సర్పంచి దుర్గ కుటుంబరావు, పిప్పరలో సర్పంచి కాకర బేబి, కేశవరంలో మిడతాని కామేశ్వరి నాగేశ్వరావు, ఎ.గోపవరంలో, పద్మ శ్రీనివాస్ వైఎస్ఆర్‌కు నివాళులర్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న రోగులకు ఆంధ్రప్రదేశ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వైఎస్ఆర్ టియుసి జిల్లా అధ్యక్షులు జాలాది వెల్సన్ బాబు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు.

పోడూరు : మండలంలోని కొమ్ముచిక్కాల గ్రామంలో వైఎస్ఆర్ జయంతిని పార్టీ నేతలు, అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్‌పిటిసి సభ్యులు పెద్దిరాజు, గ్రామ ప్రముఖులు, పార్టీ సీనియర్ నాయకులు గుంటూరి చంటిరాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు నాగరాజు బాలాజీ వర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రామకృష్ణంరాజు, యరకరాజు పెద్దిరాజు, వీరవల్లి దుర్గారావు, తానేటి సురేష్ పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని పంచాయతీ కార్యాలయ సమీపంలో ఉన్న వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, బొణం నరసింహరావు, దూసనపూడి దొరబాబు, కర్రి ఏసుబాబు, కుక్కల కృష్ణమోహన్, సంకు రామారావు, మోటూరి కుమార్‌రాజా, బి.నాగరాజు పాల్గొన్నారు.

పాలకొల్లు : కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు యడ్ల శివాజీ అధ్యక్షతన స్థానిక పార్టీ కార్యాలయంలో రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి శివాజీతో పాటు మహిళా నాయకురాలు వై.నామగిరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోనం వెంకట్రావు, షేక్ మహబూబ్ జానీ, కొలుకులూరి అర్జున్‌రావు, రొక్కాల గన్నిపాల్, చాగంటి అంజిబాబు, బొలిశెట్టి భాస్కర్, ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

పాలకోడేరు : విస్సాకోడేరు రావిచెట్టు సెంటర్‌లో రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఎంపిపి చంటిరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బొల్లా శ్రీనివాస్, ఉపసర్పంచి కందుల నాగరాజు, మాజీ సర్పంచి శ్రీనివాసరాజు, నాయకులు అశోక్‌బాబు, పాలకవర్గ సభ్యులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు. గొల్లలకోడేరులో వైసిపి గ్రామ పార్టీ అధ్యక్షులు చేకూరి రాజగోపాలరాజు ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయం సమీపన్న ఉన్న రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొగల్లు లో నిర్వహించిన

కాళ్లలో...

వేడుకల్లో వైసిపి యూత్ విభాగం మండల అధ్యక్షులు పెనుమత్స వెంకటరాజు(బాబు), ఉప సర్పంచి సీతారామ రాజు, ఎంపిటిసి సభ్యులు కాటూరి శాంతకుమారి, వెంకటలక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుగొండ : పెనుగొండలోని విజెపి కాలేజీ సెంటర్‌లో ఎంపిటిసి సభ్యులు తాడి సుబ్బిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు, వృద్ధులకు బ్రెడ్, పాలు పండ్లు అందించారు. ఈ కార్యక్రమంలో పవన్, మేడపాడు చంద్రమోహన్ రెడ్డి, సిహెచ్.రాజు, నూలి లక్ష్మణ్, పుల్లారావు పాల్గొన్నారు.

ఆకివీడు : స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహం వద్ద, స్థానిక చేపల మార్కెట్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్‌పిటిసి సభ్యులు వెంకటరాజు (ఎండగండి శ్రీనివాసు) పార్టీ నేతలతో కలిసి వైసిపి ఉండి కన్వీనర్ పివిఎల్.నరసింహరాజు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్ ఛైర్‌పర్సన్ పుప్పాల సత్యనారాయణ, వంగ జాన్సి పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : స్థానిక ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ నేతలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన పేదల పెన్నిధి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అని చెప్పారు. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు ఆనాడు ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలు చేశారని తెలిపారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రజల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, రాష్ట్ర క్రిస్టియన్, మైనార్టీ సెల్ ఛైర్మన్ జాన్సన్ పాల్గొన్నారు.

వీరవాసరం : వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను మండల వ్యాప్తంగా వైసిపి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వీరవాసరం, తోలేరు, రాయకుదురులలో నిర్వహించిన జయంతి వేడుకల్లో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. తోలేరు దళితపేటలో ఎంసి డైరెక్టర్ బిల్‌రాజ్ ఆధ్వర్యంలో రాజశేఖర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

అర్హులందరికీ పథకాలు అందించేందుకే 'జగనన్న సురక్ష'



కాళ్లలో దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న పివిఎల్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అర్హులందరికీ పథకాలు అందించాలనే ఉద్దేశంతో సిఎం జగన్ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారని డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక శ్రీబలుసులమ్మ కళ్యాణ మండపంలో మున్సిపల్ కమిషనర్ శామ్యూల్ ఆధ్వర్యంలో 10, 11, 12 వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ ఈ కార్య క్రమాన్ని సందర్శించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యల ను, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం గా అర్హులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ స్పెష ల్ ఆఫీసర్ దాసరి సావిత్రి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కర్రి భాస్కరరావు, మున్సిపల్ ఇంజినీర్ బి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

కాళ్ల :రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని దొడ్డనపూడి, కోపల్లె గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపిపి పి.శిరీష విశ్వనాధరాజు, దొడ్డనపూడి గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు, కోపల్లె గ్రామ సర్పంచి బూడి నాగమణి, మండల ప్రత్యేక అధికారి కె.కిషోర్‌కుమార్, తహశీల్దార్ టిఎ.కృష్ణారావు, ఎంపిడిఒ జి.స్వాతి, ఎఒ ఎంఎస్.ప్రభాకర్, కోపల్లె ఉప సర్పంచి వెంకట పత్రాలు, వైసిపి గ్రామ అధ్యక్షులు సాయి పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని దిగమర్రు గ్రామంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పలు ధ్రువపత్రాలు అందించారు. అనంతరం వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి రాపాక నగేష్ కరుణాకర్, జెడ్‌పిటిసి సభ్యులు నడపన గోవిందరాజులు నాయుడు, ఉప సర్పంచి కొండేటి మల్లికార్జునరావు, సొసైటీ ఛైర్మన్ రాపాక సునిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార దత్తాత్రేయ వర్మ, మాజీ ఎంఎల్‌సి శేషుబాబు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : పట్టణంలోని 4, 16, 30 వార్డుల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నవరత్న పథకాలతో పాటుగా విద్యార్థులకు జగనన్న సురక్ష పథకం ద్వారా కీలకమైన సర్టిఫికెట్లను కూడా అందించే విషయంలో వాలంటీర్లు చాలా కీలకంగా పని చేస్తున్నారన్నారు. కరోనా సమయంలో కూడా ప్రజలకు సేవలందించిన ఘనత వాలంటీర్లకు దక్కిందన్నారు. విద్యార్థులు జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం ద్వారా తమకు కావాల్సిన సర్టిఫికెట్లను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పట్టణంలోని ఐదో వార్డు పరిధిలో రూ.30 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు ఈ రోడ్డును నిర్మిస్తున్నామని చెప్పారు.

గ్లోబల్ స్థాయికి డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ

మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీనీ గ్లోబల్ యూనివర్సిటీగా తీర్చిదిద్దుతామని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. దీనికి అనుగుణంగా అవసరమైన సమగ్ర ప్రణాళిక రూపొందించాలని వైస్ ఛాన్సలర్ డాక్టర్ టి.జానకిరామ్‌ను ఆదేశించారు. మండలంలోని వెంకటరామన్నగూడెంలో ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీలో శనివారం రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ నాడు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి దేశంలోనే రెండోదిగా తాడేపల్లిగూడెంలో హార్టికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారన్నారు. నాడు ఎంఎల్‌ఎగా ఉన్న తాను ఈ యూనివర్సిటీ ఏర్పాటుకు సమగ్ర నివేదిక అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డికి సమర్పించడంతో వెంటనే యూనివర్సిటీని ప్రకటించి పది రోజుల్లో బడ్జెట్ సమావేశాల్లో, గవర్నర్ ప్రసంగంలో కూడా చోటు కల్పించారన్నారు. అదే బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో పాటు యూనివర్సిటీ చట్టాన్ని కూడా రూపొందించారన్నారు. ప్రస్తుతం 216 ఎకరాల్లో ఉన్న హార్టికల్చర్ యూనివర్సిటీకి మరిన్ని భూములు అవసరం ఉందన్నారు. ఇక్కడ ఉన్న 1400 ఎకరాల అటవీ భూములను డి నోటిఫై చేసినట్లయితే యూనివర్సిటీకి మరిన్ని భూములు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద గ్లోబల్ యూనివర్సిటీగా దీనిని తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. తొలుత చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలను మంత్రి కొట్టు సత్యనారాయణ సందర్శించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ముత్యాల ఆంజనేయులు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ముప్పిడి సంపత్‌కుమార్, వైస్ ఎంపిపి సూర్పన రామకృష్ణ, వెంకట రామన్నగూడెం గ్రామ సర్పంచి పోలిమోను నాగఅంజుష, రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, చిన్న తాడేపల్లి సర్పంచి పిచ్చుకల రాజారావు, నేలాద్రిపురం సర్పంచి రాజమహేంద్రవరపు లక్ష్మణరావు పాల్గొన్నారు.

14న టిడిపి బస్సు యాత్ర జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - మొగల్తూరు

నరసాపురం నియోజకవర్గంలో ఈ నెల 14వ తేదీన టిడిపి ఆధ్వర్యంలో చేపట్టనున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పిలుపునిచ్చారు. మండలంలోని ముత్యాలపల్లిలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు గుబ్బల నాగరాజు అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ స్థాయిలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. అనంతరం పార్టీలో చేరిన పలువురిని పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కత్తిమండ ముత్యాలరావు, బంధన నరసింహస్వామి, విప్పర్తి వెంకటేశ్వర్లు, తాడినారు రమేష్, బళ్ల శ్రీను, పాల రాంబాబు, వెలిది పుల్లారావు, లక్ష్మణుడు, కొల్లాటి భోగరాజు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎంఎల్‌ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రైతుల సంక్షేమమే లక్ష్యంగా సిఎం జగన్ పనిచేస్తున్నారని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మార్కెట్ యార్డులో రూ.95 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను శనివారం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వరి రైతులను, ఆక్వా రైతులను ఆదుకునే దిశగా ప్రతి నియోజకవర్గంలో వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ ల్యాబ్‌లో ప్రతి పరీక్ష ఉచితంగానే చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ జెడి ఆర్‌విఎస్.ప్రసాద్, డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, రాష్ట్ర క్రిస్టియన్, మైనార్టీ సెల్ ఛైర్మన్ మేడిది జాన్సన్, గొల్లగాని సత్యనారాయణ, కొట్టి కుటుంబరావు, పోలిశెట్టి దాసు, పేరిచర్ల సత్యనారాయణరాజు, అల్లూరి రాజేష్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు

మొగల్తూరు :పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మోడీలోని సాధనాల రామారావు చర్చిలో మొగల్తూరు మండల రాజధాని పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంఘ సభ్యుల సూచనల మేరకు గ్రామాల్లో క్రైస్తవ శ్మశానవాటికల, సామాజిక భవనాల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. బిషప్ డాక్టర్ కోమనపల్లి జోసఫ్‌రాజు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం చర్చిల నిర్మించాలని సూచించారు. అనంతరం ప్రసాదరాజు జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ, సాధనల రామారావు, పలువురు ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ఎం.దావీదు, ఎస్.జాన్‌పేటర్, కె.సువర్ణరాజు, కె.రత్నంరాజు, పి.కృపావరం, నోవాహు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

యీ ప్రకటన మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ది.06-06-2022 సం.రం. తేదీన ఏలూరు నగరం, పవర్‌పేటలోని ఇ-వార్డు, టి.యస్. నెం.627రు దాఖలా చ.గ.139-86లు స్థలము, అందులోని డోరు నెం.22బి-5-25రు దాఖలా అసెస్‌మెంట్ నెం.1075022858రుగా పన్ను చెల్లించబడుచున్న ఆర్.సి.సి. డాబా బిల్డింగును నా క్లయింటు అయిన యనమదల మహిత గారు వారి తండ్రి గారైన యనమదల గాంధీ గారి నుండి దఖలు పొంది ఏలూరు ఆర్.ఓ.లో 1వ పుస్తకం, దస్తావేజు నెం. 6758/2022రుగా రిజిష్టీ పొంది యున్నారు. సదరు ఆస్తికి సంబంధించినటువంటి ఒరిజినల్ దస్తావేజు యొక్క లింకు దస్తావేజును జిరాక్స్ తీయించుకొను నిమిత్తము ఏలూరు లోని సత్రంపాడు, అంబికానగర్ 3వ రోడ్డు నుండి బయలుదేరి ఏలూరులోని కోర్టు సెంటర్‌కు వెళ్ళుచుండగా మార్గమధ్యలో అనగా సత్రంపాడు నుండి ఏలూరు క్రొత్త బస్‌స్టాండ్ మధ్యలో సదరు పైన తెలిపిన నా క్లయింటు పేరున గల దఖలు దస్తావేజునకు సంబంధించిన ఒరిజినల్ లింకు దస్తావేజు నెం.3611/1980రు ఎచ్చటనో పడిపోయినది. సదరు ఒరిజినల్ లింకు దస్తావేజు నెం. 3611/1980రు దస్తావేజును గురించి నా క్లయింటు ఎంత వెతికినను దొరికియుండలేదు. సదరు ఒరిజినల్ లింకు దస్తావేజు నెం. 3611/1980రు ఎవరికైనను దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ గల వారికి తెలియజేయవలసినదిగా కోరడమైనది.కావున సదరు పైన తెలిపిన ఒరిజినల్ దస్తావేజు మరియు ఒరిజినల్ లింకు దస్తావేజునకు సంబంధించిన ఆస్తిపై ఋణము మంజూరు చేయుటకు గాను, బ్యాంకు సంబంధిత కార్యకలాపాలు మరియు బ్యాంకు వ్యవహారముల యందు ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు, క్లయిములు వున్న యెడల సదరు బ్యాంకు వారికి గాని, ఈ క్రింది అడ్రస్ గల వారికి గాని వ్రాతపూర్వకముగా రిజిష్టరు పోస్టు ద్వారా ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులులోగా తెలియపర్చవలెను. లేనిచో సదరు విషయములో ఎటువంటి ఆక్షేపణలు లేని నిర్వివాదమైన నిష్కేచ్ఛి గల ఆస్తిగా భావించి బ్యాంకు వారు ఋణమును మంజూరు చేయుదురు. సదరు గడువు తదుపరి వచ్చు అక్షేపణలు గాని, అభ్యంతరములు గాని బ్యాంకు వారు పరిగణనలోనికి తీసుకొనరనియు మరియు అట్టివి ఏమియూ బ్యాంకు వారిని బైండు చేయజాలవని తెలియపర్చడమైనది. ఏలూరు, తేది:8-7-2023,
ఇట్లు:టి.వి.విశ్వనాధం, అడ్వకేట్, ఏలూరు, 9441040029

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు :: కొవ్వూరు
F.D.P.No.7/2022
O.S.No.357/2019
Between:
శ్రీమతి గాడి రామలక్ష్మి ...పిటీషనరు /వాది
AND
శ్రీమతి జక్క మాలతి, భర్త: సోమరాజు @ సోంరాజు, వ్యాపారం, R/o. డో.నెం.23-12-7/9, మేమూరి రెసిడెన్సీ, ఫ్లాట్ నెం.302, ఇ.ఎస్.ఐ. హాస్పటల్ ఎదురుగా, పెనుమత్స వారి వీధి, సజ్జాపురం, తణుకు, తణుకు మండలం, ప॥గో॥జిల్లా. ...రెస్పాండెంటు /ప్రతివాది
పై నెంబరు పిటీషనులో రెస్పాండెంటు /ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 17-07-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటీషనులో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు పిటీషను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కొవ్వూరు, 9-7-23. వల్లభశెట్టి సురేష్ అడ్వకేట్, కొవ్వూరు.

పాస్‌పోర్టు పోయినది
UPPALAPU PEDDIRAJU అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.8-08-2019న T8547238 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు.ది. 28-6-2023న పాలకొల్లు పట్టణం నుండి నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామంలోని మా బంధువుల ఇంటికి వెళ్ళిన సందర్భంలో నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికినచో ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతు న్నాను.
UPPALAPU PEDDIRAJU
S/o. U. Venkateswara Rao
13-2-60/B, Rangamannarupeta, Union Bank Road, Palakol-534260 W.G. D., A.P.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారు :: తాడేపల్లిగూడెం
ఒ.ఎస్.నెం. 146/2019
మధ్య:
వాది: శ్రీ రావిళ్ళ వెంకటరత్నం
మరియు
ప్రతివాది: షేక్ మీరావలి
పబ్లిక్ నోటీసు శ్రీకోర్టువారి ఉత్తర్వుల మేర
యిందుమూలముగా మీకు తెలియచేయునది ఏమనగా మీరు మీ అవుసరనిమిత్తం పైవారల వద్ద అప్పు తీసుకొని వారికి ఒక ప్రామిసరీ నోటును వ్రాయించి యిచ్చినారనియు తదుపరి మీ నుండి సదరు పైకము వడ్డీతో రాబట్టుకొనుటకు నా క్లయింటు పెక్కు పర్యాయములు ప్రయత్నం చేసినను ఫలితం శూన్యమైనది. చేయునది లేక నాక్లయింటు పిటీషను దాఖలు కావించగా సదరు కోర్టువారు సదరు నోటీసు పేపరు ద్వారా పంపమని తెల్పియున్నారు. మీ పై వేసిన దావా ది.18-07-2023న మీరాకకై వేసియున్నారు కావున పై తేదీన మీరు ఖుద్దునకాని, విషయ పరిజ్ఞానముగల వకీలు ద్వారాకాని ఆరోజు 10:30 ని॥లకు వచ్చి తగు వకాల్త వేసి కౌంటరు స్టేటుమెంటులను వేయించగలరు. అట్లుకాని పక్షాన సదరు దావా మీ పరిముఖము లేకనే తీర్పు కావించబడునని యిందుమూలముగా తెలియచున్నాము.
అడ్రసు: షేర్ మీరావలి, తండ్రి: మస్తాన్, 65 సం॥లు, టింబరు వ్యాపారి, డో.13-2-42 పాండురంగ పేట, తెనాలి.
యాళ్లబండి రామకృష్ణపరమహంస
తాడేపల్లిగూడెం, 08-07-2023.
అడ్వకేటు, తాడేపల్లిగూడెం. సెల్: 99481 69761